క్లుప్తంగా

చెక్‌డ్యాం మరమ్మతు పనులు ప్రారంభం

గూడెంకొత్తవీధి: మండలంలోని జర్రెల పంచాయతీ నిట్టమామిడిపాలెం గ్రామంలో చెక్‌డ్యాం మరమ్మతు పనులను ఆదివారం సర్పంచ్ వీరోజు నాగరాజు ప్రారంభించారు. ఎంపీటీసీ సభ్యురాలు అడపా లోవలక్ష్మి, ఉప సర్పంచ్ చినతల్లి, వైఎస్సార్‌సీపీ మండల మాజీ అధ్యక్షుడు అడపా విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నేటి గ్రీవెన్స్ రద్దు

అనంతగిరి(అరకులోయటౌన్): ప్రజా సమస్యలపై ఫిర్యాదు మీకోసం కార్యక్రమాన్ని సోమవారం రద్దు చేస్తున్నట్టు ఎంపీడీవో ఎ.వి.వి.కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 14న అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని ప్రభుత్వం సెలవు ప్రకటించినందున ఈ కార్యక్రమం రద్దు చేయడమైనట్టు పేర్కొన్నారు. మండలవాసులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

15న సదరం క్యాంపు


కుమార్, ఎంపీడీఓ

అనంతగిరి(అరకులోయ టౌన్): అరకులోయ ఏరియా ఆస్పత్రిలో ఈనెల 15న మెగా సదరం క్యాంప్ నిర్వహించనున్నట్టు ఎంపీడీవో ఎం.వి.వి. కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్టిఫిషియల్ లింబ్స్ మ్యానుఫ్యాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సౌజన్యంతో ఈ కార్యక్రమం జరగనున్నట్టు పేర్కొన్నారు. దివ్యాంగులకు ఉపకరణాలు, కృత్రిమ అవయవాలు మంజూరు, అవసరాలను పరిశీలిస్తారన్నారు. ప్రతి ఒక్క దివ్యాంగులు ఈ మెగా సదరం క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సదరం సర్టిఫికెట్, ఆధార్ కార్డు, రేషన్ కార్డుతో హాజరుకావాలని ఎంపీడీవో కుమార్ తెలిపారు.

వాహనాల తనిఖీలు


గంగవరంలో వాహనాలు తనిఖీలు చేస్తున్న పోలీసులు

గంగవరం: వాహనచోదకులు కచ్చితంగా ట్రాఫిక్ నింబంధనలు పాటించాలని ఎస్‌ఐ బి.వెంకటేష్ అన్నారు. గంగవరం సెంటర్‌లో 516ఈ జాతీయ రహదారిలో వాహనాలు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఆటోలు, వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించొద్దన్నారు. జాతీయ రహదారిపై తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. వాహనం నడిపేటప్పుడు తప్పనిసరిగా లైసెన్స్, సీ–బుక్ వంటి వాహన పత్రాలు కలిగి ఉండాలన్నారు.

విద్యార్థుల చదువుపై ప్రత్యేక శ్రద్ధ


అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

అడ్డతీగల: విద్యార్థులు–తల్లిదండ్రుల భాధ్యత అనే అంశంపై మండలంలోని వీరభద్రపురం ప్రాథమికోన్నత పాఠశాలలో స్వచ్ఛంద సంస్థ భవిత ఎడ్యుకేషనల్ సొసైటీ ఆదివారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించింది. సంస్థ డైరెక్టర్ వి.ప్రభుదాస్ మాట్లాడుతూ విద్యార్థులు సమాజంలో మంచి పౌరులుగా ఎదగాలంటే ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల భాధ్యత ఎంతో ఉంటుంన్నారు. విద్యార్థుల చదువుపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలన్నారు. విద్యార్థులు– తల్లిదండ్రుల బాధ్యత అంశంపై వక్తృత్వ పోటీ నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు.

బందోబస్తుకు ప్రత్యేక చర్యలు


ఆశ్రమ పాఠశాలను పరిశీలిస్తున్న సీఐ వినోద్‌బాబు

చింతపల్లి: చింతపల్లిలో జరగనున్న ముత్యాలమ్మతల్లి జాతర బందోబస్తుకు వస్తున్న పోలీసులకు బస ఏర్పాటు చర్యలు చేపడుతున్నట్టు సీఐ వినోద్‌బాబు తెలిపారు. మండల కేంద్రంలోని ఉన్నటువంటి యువజన శిక్షణ కేంద్రం, స్థానిక గిరిజన బాలుర పాఠశాల, డిగ్రీ కళాశాలల వసతి గృహాలను ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 24 నుంచి 27వ తేదీ వరకూ జరగనున్న ముత్యాలమ్మ తల్లి జాతరలో ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో చింతపల్లి వస్తున్న పోలీసులకు బస చేయడానికి కావలసిన భవన సదుపాయాలను పరిశీలిస్తున్నామన్నారు. సుమారు 300 మందితో జాతరలో బందోబస్తు చేయనున్నామన్నారు. ఎస్‌ఐ వెంకటరమణ, హెచ్‌ఎం రామరాజుపడాల్ తదితరులున్నారు.


గోతులమయంగా మారిన గూడెం కొత్తవీధి–సీలేరు ప్రధాన రహదారి


రాళ్లు తేలిన లంకపాకలు ఘాట్‌రోడ్డు

దారుణ దారులు

- గోతులమయమైన అంతర్రాష్ట్ర రహదారి
- అధ్వానంగా ఘాట్ రోడ్లు
- వాహనచోదకుల అవస్థలు
- పెరుగుతున్న ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు

గూడెంకొత్తవీధి: అల్లూరి జిల్లాలోని పలు గ్రామాల రహదారులు అధ్వానంగా ఉన్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో చాలా ప్రాంతాలకు రోడ్ల నిర్మాణం జరిగింది. ఇందుకోసం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కోట్లాది రూపాయల నిధులను మంజూరు చేసింది. మన్య ప్రాంతాన్ని మరింతగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించడంతో పాటు పెద్ద మొత్తంలో నిధులు విడుదల చేసింది. అయితే ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో పనులు నిలిచిపోయాయి. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మన్య ప్రాంతం వైపు కన్నెత్తి చూడలేదు. గడిచిన పది నెలల్లో ఏజెన్సీలో ఒక్క రోడ్డు గాని..అభివృద్ధి పనులు గాని చేసిన దాఖలాలు లేవు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతోనూ ఒక్క పని చేయలేదు. కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం.. గిరిజనుల పాలిట శాపంగా మారింది. చాలా ప్రాంతాల్లో సరైన రహదారులు లేక గిరిజనులకు రవాణా సౌకర్యం లేకుండా పోయింది.

అడుగుకొక గొయ్యి..

గూడెం కొత్తవీధి మండంలోని చాలా చోట్ల రహదారులు దారుణంగా ఉన్నాయి. పేరుకు అంతర్రాష్ట్ర రహదారి అయినా దాని పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది. గూడెంకొత్తవీధి మండలం ఆర్.వి.నగర్ నుంచి సీలేరు వెళ్లే అంతర్రాష్ట్ర రహదారి పూర్తిగా గోతులమయమైంది. గోతులు లేని రోడ్లను నిర్మిస్తామంటూ హామీలు గుప్పించిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా కనీసం మరమ్మతులు సైతం చేపట్టలేదని గ్రామస్తులు చెబుతున్నారు. ఈ మార్గంలో ప్రయాణించలేక వాహనచోదకులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. దీంతో పాటు ఆర్.వి.నగర్ నుంచి లంకపాకలు వరకు రోడ్డు దారుణంగా ఉంది. అడుగుకొక గొయ్యి దర్శనమిస్తోంది. ఈ మార్గంలో సుమారు 10 గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. అత్యవసర సమయాల్లో అంబులెన్స్ సేవలు అందక రోగులు నరకయాతన పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. రహదారి సక్రమంగా లేకపోవడంతో రవాణా సౌకర్యం లేక వారపు సంతలకు అటవీ, వ్యవసాయ ఉత్పత్తులను తీసుకెళ్లేందుకు నానా అవస్థలు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దారాకొండ , లంకపాకలు, చప్పర్ల ఘాట్ రోడ్లు మరింత దారుణంగా ఉన్నాయి.

గడిచిన అయిదు నెలల్లో కురిసిన భారీ వర్షాలకు రహదారులు కోతకు గురయ్యాయి. ఆయా ఘాట్ రోడ్లలో పలుచోట్ల కొండచరియలు పడడంతో పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. వర్షాలు కురిసినపుడు గోతుల్లో నీరు చేరడంతో వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రాత్రిళ్లు ఆయా ఘాట్‌రోడ్లలో ప్రయాణించేందుకు భయాందోళన చెందుతున్నారు. దీంతో పాటు కొయ్యూరు– జీకే వీధి సరిహద్దు ప్రాంతం కుంకుంపూడి వరకు సుమారు 8 కిలోమీటర్లు ఉన్న ఈ దారి రాళ్లు తేలి అధ్వానంగా దర్శనమిస్తుంది. చింతపల్లి మండలం సరిహద్దులో జీకే వీధి మండల జర్రెల పంచాయతీ రహదారిది ఇదే దుస్థితి. దారకొండ– గుమ్మిరేవుల రహదారిలో చాలా చోట్ల కోతకు గురైంది. గుమ్మిరేవుల వద్ద మాదిమళ్ల బ్రిడ్జి రెండు నెలల క్రితం వచ్చిన తుపానుకు కొట్టుకుపోయింది. దీంతో ఆరు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఈ దారి తూర్పుగోదావరి జిల్లా సరిహద్దు వై.రామవరం, రాజవొమ్మంగి ప్రాంతాల వరకు ఉంది. మండలంలోని చాలా ప్రాంతాల్లో రహదారులు బాగుచేయాలని పలుమార్లు కలెక్టర్, ఐటీడీఏ పీవోలు, అధికారులు వినతులిచ్చినా కనీసం స్పందన లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.


దారాలమ్మ ఘాట్ రోడ్డు దుస్థితి

ప్రతిపాదనలు పంపాం

మండలంలోని పలు శివారు గ్రామాల్లో రహదారులను మరమ్మతు చేయాల్సి ఉంది. దీంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. రహదారుల నిర్మాణం, మరమ్మతు పనుల కోసం ఉన్నతాధికారులు, యంత్రాంగానికి ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తాం.

– భరతుడు, ఆర్‌అండ్‌బీ జేఈ

డోలీమోతలే శరణ్యం

మాగ్రామానికి సరైన రహదారి లేక నానా అవస్థలు పడుతున్నాం. ఆర్టీసు బస్సు సౌకర్యం కొరవడింది. రైతులు వారపు సంతలకు అటవీ, వ్యవసాయ ఉత్పత్తులను తీసుకెళ్లి విక్రయించుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర సేవలు అందక డోలీమోత తప్పడం లేదు. రహదారుల సమస్యలపై అధికారులకు పలుమార్లు వినతులిచ్చినా ఫలితం లేకుండా పోయింది. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలి.

– కొర్ర రవి. లంకపాకలు

ఎక్సైజ్ ఎస్‌ఐలుగా చైతన్య, రాంబాబులు బాధ్యతల స్వీకరణ


ఎక్సైజ్ సీఐ కూర్మారావును కలిసి విధుల్లో చేరిన ఎస్‌ఐలు చైతన్య, రాంబాబు

చింతపల్లి: చింతపల్లి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్లుగా వై.చైతన్య, ఎస్.రాంబాబులు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జిల్లా వ్యాప్తంగా జరిగిన ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ల బదిలీలలో భాగంగా ఇద్దరు ఎస్‌ఐలను చింతపల్లి సర్కిల్‌కు బదిలీపై వచ్చారు. ఈ మేరకు వారు స్థానిక సీఐ కూర్మారావును కలిసి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల పరిధిలో అక్రమ మద్యం, సారా వ్యాపారం వంటి కార్యక్రమాలకు నిరోధించడానికి చర్యలు చేపడతామన్నారు.

ఆంజనేయస్వామి విగ్రహానికి ప్రత్యేక పూజలు


విగ్రహాలకు పూజలు, హోమం నిర్వహిస్తున్న అర్చకులు

రాజవొమ్మంగి: జాతీయ రహదారి–516ఈ విస్తరణలో భాగంగా మండల కేంద్రంలోని పోలీసుస్టేషన్ ఎదురుగా ఉన్న అభయాంజనేయస్వామి ఆలయాన్ని ఇటీవల తొలగించారు. ఈ మేరకు ఆలయంలోని ఆంజనేయస్వామి, విఘ్నేశ్వరుని విగ్రహాలను ప్రత్యేక పూజలు, హోమాలు జరిపారు. అనంతరం ఆయా విగ్రహాలను జడేరులోని వాగులో నిమజ్జనం చేశారు. సీఐ సన్యాసినాయుడు, సర్పంచ్ రమణి, ఎంపీటీసీ సభ్యుడు గొల్లపూడి పెద్దిరాజు, నాయకులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ స్ఫూర్తితో రాజ్యాంగ రక్షణకు పోరాటం


అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న బాలదేవ్ తదితరులు

అరకులోయటౌన్: రాజ్యాంగ స్ఫూర్తితో లౌకిక ప్రజాస్వామ్య రక్షణకై ఆదివాసీల హక్కులు, చట్టాలు అమలుకై పోరాటం చేయాలని గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ అన్నారు. గిరిజన సంఘం ఆధ్వర్యంలో బస్కీ పంచాయతీ గుగ్గుడు గ్రామంలో అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాలదేవ్ మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలకు సమాన హక్కులు ఉండాలని, దేశంలో సమగ్ర అభివృద్ధి జరగాలని ఆకాంక్షించాలరన్నారు.ఆదివాసీలను అడవుల నుంచి గెండివేసేందుకు కేంద్ర ప్రభుత్వం యోచిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు హైడ్రో పవర్ ప్రాజెక్టు కోసం అనుమతులు మంజూరు చేసిందని, ఖనిజ సంపద, సహజ వనరులను ప్రైవేట్ వ్యక్తులకు దారాదత్తం చేస్తోందన్నారు.గిరిజన చట్టాలకు తూట్లు పొడుస్తోందన్నారు. జీఓ నెంబర్ 3కు చట్టబద్ధత కల్పిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తరువాత ఎటువంటి చర్యలు చేపట్టలేదన్నారు. స్పెషల్ డీఎస్సీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. అటవీశాఖ అనుమతులు లేక అనేక రోడ్ల నిర్మాణా పనులు నిలిచిపోయాయని, వెంటనే అనుమతులు ఇప్పించి పనులు పూర్తి చేయాలన్నారు. మాజీ ఎంపీటీసీ దశరథ్, నాయకులు కొండ, సద్దు, సొనబాబు, బస్వా తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సన్మానం


శివగణపతిని సన్మానిస్తున్న ఎంపీపీ కృష్ణారెడ్డి, సర్పంచ్‌లు వెంకటేశ్వర్లు, రామలక్ష్మి తదితరులు

గంగవరం : మఠ్రిపాలెం పంచాయతీ కార్యదర్శి జమ్మల శివగణపతి అందించిన సేవలు ఎంతో అభినందనీయమని ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి, మఠ్రిపాలెం, ఎండపల్లి సర్పంచ్‌లు రామలక్ష్మి, వెంకటేశ్వర్లుదొర అన్నారు. గ్రేడ్–3 కార్యదర్శిగా పదోన్నతి పొంది పందలపాక బదిలీపై వెళ్లిన మఠ్రిపాలెం పంచాయతీ కార్యదర్శి శివగణపతికి సచివాలయ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది ఘనంగా సత్కరించారు. శివగణపతి ఎండపల్లి, మఠ్రిపాలెం పంచాయతీల అభివృద్ధికి విశేష కృషి కృషి చేశారని పలువురు కొనియాడారు. వైస్ సర్పంచ్ వీరరాఘవరెడ్డి, నాయకులు పి.వెంకటరెడ్డి, నూకరెడ్డి, రాజారెడ్డి, బాలరామకృష్ణ రెడ్డి, నివాసు, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

300 మందికి వైద్య పరీక్షలు


శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యుడు

రంపచోడవరం: రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల ఆధ్వర్యంలో సిరిగిందలపాడులో ఆదివారం వైద్య శిబిరం నిర్వహించారు. రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞాయనందజీ మహారాజ్ మాట్లాడుతూ సుమారు 300 మందికి వైద్య సేవలు అందించినట్టు తెలిపారు. పరమహంస యోగానంద నేత్రాలయం (వేమగిరి) ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం నిర్వహించి 60 మందికి కంటి పరీక్షలు చేసి 15 మందికి కళ్లద్దాలు అందజేశామన్నారు కంటి ఆపరేషన్‌ల నిమిత్తం 17 మందిని వేమగిరి కంటి ఆస్పత్రికి తరలించినట్టు పేర్కొన్నారు. రామకృష్ణ మిషన్ ద్వారా ప్రతి ఆదివారం అందిస్తున్న వైద్య సేవలను గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిబిరంలో వైద్యులు సుబ్బారావు, రాయుడు శ్రీనివాస్, దాసరి ఉమహేష్ తదితరులు సేవలందించారు.

అమ్మవారి జాతర విజయవంతానికి సహకరించండి


మాట్లాడుతున్న ఉత్సవ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు హేమంత్ కుమార్, వినాయకరావు


పాతబస్టాండ్ వద్ద స్టేజీ ఏర్పాట్లు


- ఉత్సవ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు హేమంత్‌కుమార్, వినాయకరావు

చింతపల్లి: చింతపల్లిలో జరుగుతున్న ముత్యాలమ్మ తల్లి జాతర మహోత్సవాలను విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఉత్సవ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు దురియా హేమంత కుమార్, పసుపులేటి వినాయకరావులు కోరారు. ఆలయ ప్రాంగణంలో కమిటీ సభ్యుల సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 24 నుంచి 27వ తేదీ వరకూ ముత్యాలమ్మ జాతర మహోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఏడాది అత్యంత వైభవంగా ఈ జాతరను జరపడానికి ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నామన్నారు.ఈ నేపథ్యంలో అన్ని వీధుల్లో విద్యుత్‌దీపాలతో అలంకరిస్తున్నట్టు తెలిపారు. పాత బస్టాండ్ ఆవరణలో జెయింట్‌వీల్ ఏర్పాటుచేయనున్నట్టు పేర్కొన్నారు. మూడు స్టేజీలు ఏర్పాటుచేసి, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

16న వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం

గంగవరం : మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ మండల కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం ఈనెల 16న మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహిస్తున్నట్టు పార్టీ మండల ఇన్‌చార్జి, జిల్లా బూత్ కమిటీల అధ్యక్షుడు సీహెచ్.దుర్గా రఘునాథ్ తెలిపారు. సమావేశానికి ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్(బాబు), మాజీ ఎమ్మెల్యే, రంపచోడవరం నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి నాగులపల్లి ధనలక్ష్మి హాజరవుతారని ఆయన వివరించారు. మండలంలో గల పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో నూకాంబిక అమ్మవారు

అనకాపల్లి: ఉత్తరాంధ్ర ఇలవేల్పు గవరపాలెం నూకాంబిక ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఆవరణలో చలువ పందిళ్ల వద్ద వంటలు చేసుకుని అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. పలు స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు ఆలయానికి వచ్చిన భక్తులకు ఉచిత తాగునీరు, మజ్జిగ, అమ్మవారి ప్రసాదాన్ని పంపిణీ చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దేవదాయశాఖ సహాయ కమిషనర్ వెంపలి రాంబాబు, ఉత్సవ కమిటీ చైర్మన్ పీలా నాగశ్రీనులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పట్టణ, ట్రాఫిక్ సీఐలు టీవి.విజయకుమార్, ఎం.వెంకటనారాయణలు గట్టిపోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు. మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి దంపతులు, భగవత్‌గీత ఖ్యాతి ప్రవచనకర్తలు డాక్టర్ సంతోష్‌కుమార్, ఆమెగ్‌దేశ్‌పతి తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక


తాళ్లపాలెంలో సమావేశమైన పూర్వ విద్యార్థులు

రంపచోడవరం: రంపచోడవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1988–89 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం మండలంలోని తాళ్లపాలెంలోని ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. వివిధ ప్రాంతాల ఉన్న పూర్వ విద్యార్థులంతా ఒకచోట కలిశారు. ఒకరికొకరి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అలనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఈ సందర్భంగా తమలోని కొంతమంది మిత్రులకు ఆర్థికంగా ఇబ్బంది పడుతుండడంతో వారికి ఆర్థిక సహాయం అందజేశారు. సాయంత్రం వరకు సందడి చేశారు.

ఎటపాక: తాము చదువుకున్న బడిలోనే తమ స్నేహితులను కలుసుకుని సంతోషాలను పంచుకున్నారు పూర్వవిద్యార్థులు. గౌరిదేవిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2006–07లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు అదే పాఠశాలలో ఆదివారం కలుసుకుని సందడి చేశారు. సెల్ఫీలు తీసుకుని ఆత్మీయంగా ఒకరినొకరు పలకరించుకుని పులకరించిపోయారు. ఉద్యోగాలు, ఉపాధి రంగాల్లో స్థిరపడి ఇలా కలుసుకోవడం సంతోషంగా ఉందని మురిసిపోయారు. మరలా విద్యార్థులై పాటలు పాడుతూ నృత్యాలు చేశారు. ఆనాటి గురువులను సన్మానించుకుని వారు నేర్పిన విద్య, సమాజ విలువలను గుర్తుచేసి గురువులకు నమస్కరించుకున్నారు.



గౌరిదేవిపేటలో ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

19 నుంచి సుబ్రహ్మణ్యస్వామి తీర్థ మహోత్సవాలు

చింతపల్లి: మండలంలోని చౌడుపల్లి పంచాయతీ కేంద్రంలో ఈ నెల 19 నుంచి 21వ తేదీ వరకు సుబ్రమణ్యస్వామి తీర్థ మహోత్సవాలను నిర్వహిస్తున్నట్టు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ప్రతి రోజు సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై ఉత్సవాలను విజయవంతం చేయాలని ఉత్సవ కమిటీ సభ్యులు కోరారు.

గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో పామ్‌సండే


చింతపల్లిలో మట్టలతో ఊరేగింపుగా వెళ్తున్న క్రైస్తవులు


అప్పలరాజుపేట చర్చ్‌కు మట్టలతో ఊరేగింపుగా వెళ్తున్న క్రైస్తవులు


అడ్డతీగలలోని ఊరేగింపులో క్రైస్తవులు

చింతపల్లి: జిల్లా వ్యాప్తంగా పామ్ సండేను (మట్టల ఆదివారం) భక్తిశ్రద్ధలతో క్రైస్తవులు జరుపుకున్నారు. ఈ సందర్భంగా చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. క్రీస్తు గీతాలను ఆలపించారు. వాడవాడలా క్రైస్తవులు ఈత మట్టలను రంగు, రంగు పూలతో అలంకరించి ఊరేగింపుగా చర్చిలకు తరలివెళ్లారు. గుడ్ ఫ్రైడే, ఈస్టర్ పండుగకు ముందు వచ్చే ఆదివారం నాడు ఈ వేడుకను జరుపుకొంటారు. పాస్టర్లు క్రీస్తు సందేశాన్ని తెలియజేశారు. పామ్ సండే, గుడ్‌ఫ్రైడే, ఈస్టర్‌ల విశిష్టతను వివరించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. చింతపల్లిలోని సెయింట్ ఆన్స్ పాఠశాలలో పాస్టర్ బాలరాజు, ఆదివాసీ ప్రభావిత ప్రథం చర్చిలో పాస్టర్ ఏసురత్నం వాక్యోపన్యాసం చేశారు. సెయింట్ పాఠశాల కరస్పాండెంట్ సిస్టర్ కార్టీస్, ప్రిన్సిపాల్ రేణు, మాజీ ఎంపీపీ మచ్చమ్మ తదతరులు పాల్గొన్నారు.

అడ్డతీగల: అడ్డతీగలలోని లూథరన్ చర్చిలో దైవ సేవకులు రెవరెండ్ భూషణ్‌కుమార్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

గంగవరం: మండల కేంద్రంతో పాటు కుసుమరాయి గ్రామంలో జరిగిన వేడుకలో పాస్టర్లు సంతోష్, బాబూరావు, ప్రసాద్‌బాబు తదితరులు ప్రత్యేక ప్రార్థనలు, పామ్ సండే విశిష్టతను వివరించారు.

ఎటపాక: మండల కేంద్రంతో పాటు గౌరిదేవిపాటు జి.కె.పాడు లూథరన్ చర్చిల్లో టీఎఫ్‌టీ హాస్టల్ చిన్నారులు, క్రైస్తవులు భక్తిగీతాలను ఆలపించారు. పాస్టర్లు ఏలియా, ప్రభాకర్‌లు క్రీస్తు సందేశాన్ని వివరించారు.


ఎటపాకలో చర్చి వద్ద మట్టలతో చిన్నారులు

మోతుగూడెం: మోతుగూడెం, పొల్లూరు యూసీమ్ చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్లు గ్రామ విధుల్లో తిరుగుతూ క్రీస్తు సందేశాన్ని అందించారు.

రాజవొమ్మంగి: మండల కేంద్రంతో పాటు అప్పలరాజుపేటలోని చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.